తెలంగాణ ముఖ్యమంత్రికి అరుదైన అహ్వానం !

తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావుకు సింగపూర్లో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ పూర్వవిద్యార్థుల అసోసియేషన్ నిర్వహించే సదస్సుకు  అహ్వానం అందింది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, దేశంలోనే విభిన్నమైన - వినూత్నమైన నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించడంలో నిమగ్నమైన ముఖ్యమంత్రిని వాళ్లు ప్రత్యేకంగా ఆహ్వానించారు. వివిపి గెస్ట్ గా హాజరవడమే కాకుండా వివిధ దేశాల నుంచి ఈ కార్యక్రమానికి హాజరయ్యే ఐఐఎం పూర్వవిద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించాలని కోరారు. సింగపూర్ లోని రాఫెల్స్ సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఆగస్ట్ 22 - 23వ తేదీన జరగబోతున్న ఈ కార్యక్రమానికి సింగపూర్ ప్రధాని లీ హ్సీన్ లూంగ్(lee hsien loong), అధ్యక్షుడు ఎస్. ఆర్. నాథన్, డిప్యూటీ ప్రధాని థర్మన్ షణ్ముగ రత్నం, మంత్రి ఎస్. ఈశ్వరన్ కూడా హాజరుకాబోతున్నారు. ఐఐఎం అలుమ్ని సింగపూర్ నుంచి ఆహ్వానం అందుకున్న తొలి ముఖ్యమంత్రి కెసిఆరే కావడం గమనర్హం. భారత్ నుంచి ఈ ఆహ్వానం అందుకున్న ఏకైక ముఖ్యమంత్రి కూడా కేసీఆరే. సదస్సుకు ఆహ్వానిస్తూ నిర్వాహకులు ఓ లేఖను కూడా ముఖ్యమంత్రికి పంపారు.

తెలంగాణ ఏర్పాటులో కీలకపాత్ర పోషించడం మొదలు.. కొత్త రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు తీయించడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రికి ఐఐఎం అలుమ్నీ శుభాకాంక్షలు తెలిపింది. కొత్త రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక విధానాలతో పాటు ఐఐఎం అలుమ్నీ ఎలాంటి పాత్ర పోషించాలనే అంశంపై ప్రధానంగా ప్రసంగించాలని వాళ్లు కోరారు. సింగపూర్ ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డ్ కూడా తెలంగాణ ప్రభుత్వం తీసుకురాబోతున్న పారిశ్రామిక విధానంపై ఆసక్తిగా, ఉత్సాహంగా ఉన్న నేపధ్యంలో తెలంగాణకు అవసరమైన సాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. సింగపూర్ పర్యటనలో ముఖ్యమంత్రితో చర్చించేందుకు సిఈఓల బృందం కూడా సిద్ధంగా ఉంటుందని వారు కేసీఆర్ కు  వివరించారు.

ఇంపాక్ట్ 2014 పేరుతో జరుగుతున్న ఈ రెండు రోజుల కార్యక్రమానికి సింగపూర్ తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐఐఎం సభ్యులు, కార్పొరేట్ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు హాజరుకాబోతున్నారు. సింగపూర్ తోపాటు ఆసియాలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, వివిధ రంగాల్లో నూతన ఒరవడులు, బిజినెస్ ఐడియాస్ ను ఇక్కడ చర్చించబోతున్నారు. 2013లో

ఏర్పాటు చేసిన సమావేశాలకు అనూహ్యమైన స్పందన రావడంతో ఈ సారి రెట్టించిన ఉత్సాహంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు సిఎంకు వివరించారు.

కాగా, ఈ కార్యక్రమానికి హాజరవుతారని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. నూతన పారిశ్రామిక విధానాన్ని సింగపూర్ తరహాలో రూపొందిస్తామని ఇప్పటికే పలు సందర్భాల్లో కేసీర్ పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. అక్కడి మోడల్ ను పరిశీలించడంతో పాటు అక్కడి ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ సింగపూర్ వెళ్తున్నారు. ఆలోపుగానే తెలంగాణ పారిశ్రామిక విధానం కూడా ఖరారు అవుతుంది కాబట్టి అక్కడ దాన్ని వివరిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే అవినీతి రహిత, పారదర్శక పారిశ్రామిక విధానాన్ని బాగా ప్రచారం చేయడానికి కూడా ఈ సదస్సు ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ముఖ్యమంత్రి వెంట ఆయన వెంట సిఎంఓ అధికారులు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు కూడా సింగపూర్ వెళ్తున్నారు. రెండు, మూడు రోజుల పాటు సింగపూర్ లో ఉండి పూర్తిగా అక్కడి పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారు. బంగారు తెలంగాణ కల సాకారం చేసేందుకు నూతన పారిశ్రామిక విధానమే పట్టుకొమ్మని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. సింగపూర్ సదస్సును కూడా తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి, పెట్టుబడులను ఆహ్వానించేందుకు ఓ అవకాశంగా మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది.